క్లుప్తంగా

కమ్మ సేవా సమితి కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సభ్యులకు సన్మానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో కమ్మ సేవా సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించి, నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొల్లి విష్ణువర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా వడ్డె వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంగవరపు వెంకటేశ్వర్ రావు, కోశాధికారి వెనిగళ్ల శ్రీనివాసరావులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యవర్గ ఎన్నిక అధ్యక్షుడు విష్ణువర్ధన్, మాజీ అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికైన సభ్యులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిథిగా పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ మనుగడకు నీరు ప్రధానమని, ప్రతి ఒక్కరూ నీటి విలువను తెలుసుకుని వాడుకోవాలన్నారు. అనంతర నీటి సామర్థ్యం నీటి విలువలు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కెవీ ప్రతాప్, కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా, సిబ్బంది పాల్గొన్నారు.

కట్ట పోచమ్మకు వెండి అందజేత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హమాలివాడ కట్ట పోచమ్మ ఆలయానికి మంగళవారం పలువురు దాతలు 13తులాల వెండిని అందించారు. 15వ వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత ఆధ్వర్యంలో దాతలు గుంజపడుగు నర్సమ్మ, రాజయ్య దంపతులు 5తులాల వెండి, బండారి సుహాసిని శ్రీనివాస్ దంపతులు 3తులాలు, బుద్దార్థి లత శ్రీనివాస్ దంపతులు 5తులాల వెండిని అందించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు ఉస్కమల్ల శంకర్, బండ విష్ణు, శ్రీరాముల మల్లేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన

నెన్నెల: గ్రామాల దూరాన్ని తగ్గిస్తూ ప్రజలను దగ్గరికి చేర్చుతున్న ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, శుభప్రదమని మంచిర్యాల డిపో అసిస్టెంట్ మేనేజర్ దేవపాల అన్నారు. 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుశ్నపల్లి గ్రామస్తులు, విద్యార్థులకు ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు, దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాస్ సౌకర్యం, పెళ్లి, ఇతర శుభకార్యాలకు బస్సులు అద్దెకు ఇస్తామని చెప్పారు. ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా, ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సంస్థకు అండగా నిలువాలన్నారు. కుశ్నపల్లి నుంచి వేమనపల్లి మండలం సామనపల్లి రూట్‌ను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి తప్పకుండా బస్సు సౌకర్యం కల్పిస్తామని మీరంతా ఆర్టీసీలోనే ప్రయాణం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కుమార్

లక్సెట్టిపేట: ఐకేపీ వీఓఏలకు కనీస వేతనాలు చెల్లించాలని వీఓఏ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంటాల కుమార్ అన్నారు. స్థానిక ఐబీ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు రక్షణకరువైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీఓఏలకు పెరిగిన ధరల ప్రకారం వేతనాలు పెంచా లని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్సు సౌకర్యాలు అందించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షులుగా పద్మ, ఉపాధ్యక్షుడిగా మహేందర్, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, సహాయ కార్యదర్శిగా శాంతకుమారిని ఎన్నుకున్నారు.

తూలుతూ.. తోలుతూ..!

- మత్తులో వాహన చోదకులు
- కౌన్సెలింగ్ ఇచ్చినా మారని తీరు
- లక్సెట్టిపేట సర్కిల్ పరిధిలో 3 నెలల్లో 291కేసులు


దండేపల్లి: మేదరిపేటలో బ్రీత్ ఎనలైజర్‌తో పోలీసుల తనిఖీలు(ఫైల్)

దండేపల్లి: మద్యం అమ్మకాలు ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా సాగడంతో, మద్యం ప్రియులు కూడా ఎక్కడ దొరికితే అక్కడే తాగుతున్నారు. ఇలాంటి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కూడా బాగానే నమోదు అవుతున్నాయి. లక్సెట్టిపేట సర్కిల్ పరిధిలోని లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు నెలలుగా సుమారు 291డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. పోలీసులు ప్రతీరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ, ప్రతీ నెల సుమారు 30నుంచి 40వరకు డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. తాగి వాహనాలు నడిపిన వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్న కొందరిలో మార్పు రావడం లేదు. డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో దొరికిన వారిని కోర్టులో ప్రవేశపెట్టి జరిమానా కట్టిస్తున్నారు. అయినా కొందరు వాహనదారులు మత్తువీడటం లేదు.

సాయంత్రం వేళల్లో..

సాయంత్రం 6నుంచి 9గంటల లోపు చాలా మంది మద్యం దుకాణాలకు వెళ్లి పక్కనే ఉండే పర్మిట్ గదుల్లో సీసాలు ఖాళీ చేసి, మద్యం మత్తులో తూలుతూ, వాహనాలు తోలుతూ రోడ్డెక్కుతున్నారు. ఈ సమయంలో పోలీసులు నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కుతున్నారు.

తాగి వాహనాలు నడపొద్దు



వాహనదారులు ఎవరైనా సరే తాగి వాహనాలు నడపొద్దు. తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు తాగి వాహనాలు నడపడంతో, ఎదుటి వారిని ఇబ్బంది కలిగించడంతో పాటు, మనం కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రమాదాలు జరిగితే కుటుంబ సభ్యులకు బాధను మిగిల్చిన వారం అవుతాం. ఎవరు కూడా తాగి వాహనాలు నడపొద్దు, అలాంటి వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుంది. – కృష్ణారెడ్డి, సీఐ, లక్సెట్టిపేట

కఠినంగా వ్యవహరిస్తున్నా..

ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రతీ రోజు వాహనతనిఖీలు నిర్వహిస్తున్నారు. తాగి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నా, కొందరు తమ తీరు మారడం లేదు. దీంతో చాలా చోట్ల జరిగే ప్రమాదాల్లో తాగి వాహనాలు నడిపినవే ఎక్కువ ఉంటున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి.

అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు

- హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు
- పోచంపాడులో 12ఎకరాల ప్రభుత్వ స్థలం స్వాధీనం


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ భూములు ఆక్రమించడం కానీ అక్రమ కట్టడాలు చేపట్టినా కానీ చట్టపరమైన చర్యలు తప్పవని హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు స్పష్టం చేశారు. మండలంలోని ముల్కల్ల గ్రామం పరిధిలోని పోచంపాడు రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 94లోని 12ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. జేసీబీలు, ట్రాక్టర్లతో మొక్కలు తొలగించి మరీ స్థలాన్ని చదునుచేయించి ఆక్రమించారు. సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ రాజలింగు, గిర్దావర్ లావణ్య, సర్వేయర్ మధూకర్‌తో పాటు వీఆర్‌ఏ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి సర్వే చేపట్టారు. ప్రభుత్వ స్థలంలోని ఇతర కట్టడాలను తొలగించి, ఆక్రమదారులను ప్రభుత్వ స్థలం నుంచి పంపించేశారు. రెవెన్యూ సిబ్బందితో హద్దులు ఏర్పాటు చేయించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములు కబ్జాలు చేస్తున్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కొనసాగుతున్న పోషణ్ పక్వాడ


లక్సెట్టిపేట: మాట్లాడుతున్న డీడబ్ల్యూవో చిన్నయ్య

వేమనపల్లి/భీమిని/మంచిర్యాలటౌన్/జైపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట/చెన్నూర్: జిల్లా వ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమం మంగళవారం కొనసాగింది. చిరుధాన్యాల లాభాలను వివరించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచన, సీడీపీవో స్వరూప, సూపర్‌వైజర్ టి.రమాదేవి, జైపూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, హాజీపూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, లక్సెట్టిపేటలో డీడబ్ల్యూవో చిన్నయ్య, చెన్నూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, వేమనపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, కన్నెపల్లిలో సూపర్‌వైజర్ ఇందిరా, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


మాట్లాడుతున్న దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల శివారులోని ఆర్‌పీ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి మంగళవారం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడంతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని సూచించారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, బీఆర్‌ఎస్ పార్టీని పటిష్టం చేయడానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు అహర్నిశలు శ్రమించాలని తెలిపారు. కష్టపడి పని చేసేవారిని పార్టీ ఆదుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు బురదజల్లే రాజకీయాలు చేస్తున్నాయని వారికి ప్రజల చేతిలో త్వరలోనే తగిన బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు. ప్రతీ ఒక్కరి అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ, భద్రత కల్పించేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్


గిరిజనులకు రంజన్‌లు అందజేస్తున్న సీఐ సంజీవ్, ఎస్సైలు ఉదయ్‌కిరణ్, రవికుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజలకు రక్షణ, భద్రత కల్పించేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల రూరల్ సీఐ తోట సంజీవ్ తెలిపారు. హాజీపూర్ మండలం పెద్దంపేటలో గల కొలాంగూడ గిరిజన తాండాలో మంగళవారం రామగుండం సీపీ ఆదేశాల మేరకు గిరిజనులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిజన కుటుంబాలకు వేసవిలో చల్లని మంచినీరు తాగేందుకు అవసరమైన రంజన్‌లు అందజేసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ, భద్రత కల్పిస్తూ సమాజంలో నేరాలను నిర్మూలించేలా పోలీసులు పనిచేస్తున్నట్లు తెలిపారు. వాహనాలు నడిపేందుకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పిల్లలను పనులకు పంపకుండా ఉన్నతంగా చదివించాలని, బాల్య వివాహాలు చేయొద్దని తెలిపారు. తాండాలో, గ్రామంలో ఎలాంటి అనుమానాలు తలెత్తినా 100నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని వివరించారు. కార్యక్రమంలో హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్, సీసీసీ ఎస్సై రవికుమార్, పోలీస్ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సు కోసమే పథకాలు

- మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు


ఎన్టీఆర్‌నగర్‌లో పనులు ప్రారంభిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమిపూజ చేసి ప్రారంభించారు. 7వ వార్డు ఎన్టీఆర్‌నగర్‌లో రూ.30లక్షలతో, 21వ వార్డు ఎల్‌ఐసీ కాలనీలో రూ.25లక్షలతో, 4వ వార్డులో శ్రీ కృష్ణ కాలనీలో రూ.30లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు ప్రకాశ్‌నాయక్, కొండ పద్మ, మోతె సుజాత, నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు మంగళవారం ప్రారంభించారు. పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ కాలనీ ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ సీడీపీ నిధులు రూ.5లక్షలతో నిర్మించిన ప్రహరీని ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. అనంతరం 6వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కౌన్సిలర్లు పూదరి కుమార్, చిడం మహేశ్, మడిగ మల్లయ్య, నాయకులు రఫిక్, రౌతు రజిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రాల శ్రీధర్ జన్మదిన వేడుకలు


శ్రీధర్‌కు కేక్ తినిపిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ రవి

మంచిర్యాలటౌన్: అంజనీపుత్ర ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా తలసేమియా, సికిల్‌సెల్ బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ.. శ్రీధర్ నిరుపేదలకు సాయం చేయడంలో, సమాజానికి సేవలందించడంలో ముందుంటారని, రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త అధ్యాయాన్ని సృష్టించారన్నారు. డీసీపీ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడినవారమవుతామన్నారు. అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని, రక్తదానం మహాధానం అని పేర్కొన్నారు. అంజనీపుత్ర ఎస్టేట్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి, డైరెక్టర్లు గంగూల సంతోష్, సురనేని కిషన్, కాసర్ల సదానందం, పూసాల వెంకన్న, దొమ్మటి తిరుపతి, గుర్రాల సురేష్, ఐరెని ప్రవీణ్, కళ్యాణ్, సాయి చరణ్, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు భాస్కర్, మహేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఆందోళన


ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ కార్యకర్తలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులోని ఓ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల ఎదుట మంగళవారం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుకుంట్ల సన్నిగౌడ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థిపై ఓ లెక్చరర్ చేయి చేసుకోగా, అతని కంటికి గాయాలయ్యాయని, ఆ లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం లెక్చరర్‌పై చర్యలు తీసుకుంటామని హామీని ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సిద్ధార్థ, లక్కీ, పవన్, సాయి చరణ్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మాదవరపు సృజనరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకాగా అధికారులు తమతమ నివేదికలను చదివి వినిపించారు. ఉద్యానవన అధికారి సుప్రజ మాట్లాడుతూ.. పామాయిల్ సాగుపై సబ్సిడీ అందిస్తున్నట్లు, ఆసక్తి కలిగిన రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయాలన్నారు. కన్నెపల్లి ఇన్‌చార్జి ఏపీఎం మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు ఈ సంవత్సరం రూ.13కోట్ల పైచిలుకు లక్ష్యంగా ఉండగా, రూ.12కోట్ల రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. రైతుల కోసం వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్ తక్కువ అద్దెతో అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ అధికారులు సూచించారు. ఈ సమావేశానికి అధికారులందరూ హాజరై సమస్యలపై చర్చిస్తేనే అభివృద్ధి పనులు జరుగుతాయని ఎంపీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాకేష్‌శర్మ, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో రాధాకిషన్, కో ఆప్షన్ సభ్యుడు అంకూస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత భద్రత పాటించాలి


అవగాహన కల్పిస్తున్న జీఎం ఆనంద్

జైపూర్: పని ప్రాంతాల్లో ప్రతి ఉద్యోగి వ్యక్తిగత భద్రత పాటించాలని, భద్రతే ప్రథమం అని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిపై మంగళవారం సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్ఓపీ) సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. గనుల్లో ప్రతి క్షణం అప్రమత్తతో పని చేయాలని, పని స్థలాల్లో వ్యక్తిగత రక్షణ పరికరాలు వినియోగించాలన్నారు. రక్షణే ధ్యేయంగా తెలిపే సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను తమ రోజు వారి విధిలో తప్పక పాటించాలని తెలిపారు. ఐకే-1ఏ, ఐకే-ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రమాదరహిత బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా ఉద్యోగులంతా రక్షణ సూత్రాలు పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఓసీపీ ఆపరేషన్స్ మేనేజర్ బ్రహ్మాజీరావు, రెస్క్యూ ఇన్‌చార్జి రామ్మోహన్, రక్షణాధికారి సతీశ్, సంక్షేమాధికారి గౌస్‌పాషా, ఫిట్ కార్యదర్శులు గద్దం మల్లన్న, రత్నాకర్‌రెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలి

నస్పూర్: సీసీసీ నస్పూర్ సింగరేణి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు రాబోవు పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సూచించారు. పాఠశాల ఆవరణలో మంగళవారం సింగరేణి పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం త్యాగరాజు, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్ రావు, పర్సనల్ మేనేజర్ రాధాకృష్ణ మూర్తి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్‌రావు, ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, కోశాధికారి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఆర్‌పీ 3 గనిలో నెలకొన్న కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఆర్‌పీ 3గనిపై టీబీజీకేఎస్ నాయకులు మంగళవారం అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. 2020సంవత్సరంలో 190మస్టర్లు పూర్తి చేసుకున్న బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా ప్రమోట్ చేయాలని, గనిలో వాడుతున్న సెల్ఫ్ రెస్క్యూ మిషన్ల వాడకాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు డీబీజీకేఎస్ నాయకులను కోరారు. 2016లో నియామకమైన జేఎంఈటీ మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులకు కట్ అయిన సీఎంపీఎఫ్ మొత్తం వారి అకౌంట్లలో జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో చర్చల ప్రతినిధులు వెంగళ కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, డివిజన్ నాయకులు పానుగంటి సత్తయ్య, మోతె రాఘవరెడ్డి, తొంగల రమేశ్, జగదీశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పోగాకు రమేశ్, నీలం సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉక్కపోత కష్టాలు


ఫ్యాన్‌లు లేని తరగతి గదిలో విద్యార్థులు

కాసిపేట: పాలకుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారుతోంది. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లోని తరగతి గదుల్లో ఫ్యాన్‌లు, విద్యుత్ కనెక్షన్ లేక విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. 600 మందికి పైగా విద్యార్థులున్న పాఠశాలలో కనీస సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలిసికట్టుగా హక్కులు సాధించుకోవాలి

కాసిపేట: మున్నూరుకాపుల అభివృద్ధికి కలిసికట్టుగా ఉండి హక్కులు సాధించుకోవాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లక్ష్మణ్‌పటేల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో మంగళవారం మండల సమావేశం నిర్వహించి, నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు, ఆర్థికభివృద్ధి సాధనకు ఏకమై పోరాటాలు చేయాలన్నారు. మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా అగ్గి సత్తయ్య పటేల్, ప్రధాన కార్యదర్శిగా కొమ్ము సతీష్ ఎన్నికయ్యారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

కోటపల్లి: పంటలకు ఎరువులను మోతాదుకు మించి వేయొద్దని రైతులకు కోటపల్లి ఏవో మహేందర్ సూచించారు. మండలంలోని మల్లంపేట రైతువేదికలో ఎరువుల వినియోగం, యాసంగిలో సాగు చేస్తున్న పంటల సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో పీక పురుగు, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్కల మధుకర్, ఏఈవోలు వైష్ణవి, రాజుకుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను వినియోగించుకోవాలి

బెల్లంపల్లి: ఉన్నత విద్యావకాశాల కోసం ప్రభుత్వ విద్యాసంస్థలను వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు సూచించారు. సీఓఈ కళాశాలలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని, ప్రతి విద్యార్థి సైతం ఉన్నత చదువుల కోసం ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరడానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ కోఆర్డినేటర్ రవి, నీట్, ఐఐటీ పరీక్షల నిపుణుడు రమేష్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు మహేష్, సమ్మయ్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్, వెంకన్న, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.